జూన్ 20న ఏఐసీఎఫ్ వార్షికోత్సవం


మాట్లాడుతున్న ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు

కాచిగూడ: ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 28వ వార్షికోత్సవ వేడుకలను జూన్ 20న సికింద్రాబాద్‌లోని అమృతవాణి హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సంస్థ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు తెలిపారు. బుధవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన క్రైస్తవ ప్రముఖులకు క్రైస్తవ సేవా వజ్ర, క్రైస్తవ సేవా మిత్ర, క్రైస్తవ సేవా రత్న అవార్డులను అందించనున్నట్లు తెలిపారు. ఆయా రంగాల్లో సేవలందించిన వారు జూన్ 10 లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ గిడియోను బాబు ఏకేను సెల్: 9652799777 లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డేవిడ్ కదారి, యస్. ప్రదీప్, జయశ్రీ టైటస్, డాక్టర్ యస్.అబ్రహం, బిషప్ డాక్టర్ జి.సామ్యూల్ జాన్, బిషప్ యం.ఆరోన్, గ్రేస్ నిర్మల, పాస్టర్ ప్రవీణ్ కుమార్ పాక, బిషప్ వైఎస్ఎన్ మూర్తి, జి.స్టాన్లీ అంథోని, పాస్టర్ ప్రభాకర్, అమర్నాథ్, గిడియోను బాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధం అమలు చేయాలి


మాట్లాడుతున్న డాక్టర్ సింగం శ్రీనివాసరావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో మద్యపానాన్ని నిషేధించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ సింగం శ్రీనివాస రావు అన్నారు. రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తే ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవిస్తుందన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి పాటుపడాలంటే మద్యపాన నిషేధం చక్కటి పరిష్కారం అన్నారు. తమ పార్టీ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తుందని అన్నారు. మద్యపానం వల్ల ఎంతో మంది యువకులు తమ జీవితాన్ని పాడు చేసుకుంటున్నారని వారితో పాటు ఎన్నో కుటుంబాలకు అన్యాయం జరుగుతుందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి మద్యపానం నిషేధంపై వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 15 నుంచి శాంతియుత ప్రజా ఉద్యమాన్ని చేపడతామన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు కె.బి.శ్రీధర్, సలహాదారులు అనిత, పుష్పాంజలి, గ్రేటర్ యువజన విభాగం అధ్యక్షులు నవీన్, కార్యవర్గ సభ్యులు సత్య, నర్సింహ్మా, గుప్తా, కనక దుర్గా, నందికొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

1969 తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి


1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి నేతల జేఏసీ కన్వీనర్ ఎస్.గోపాల్‌రావు

కాచిగూడ: 1969లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమం చేసి జైలు జీవితం గడిపిన విద్యార్థి ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని 1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి నేతల జేఏసీ కన్వీనర్ ఎస్.గోపాల్‌రావు అన్నారు. అప్పటి ఉద్యమకారులు వయస్సు పైబడి ఆర్థికంగా, ఆరోగ్య పరంగా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. బుధవారం కాచిగూడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోపాల్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సం సందర్భంగా ఉద్యమకారులను ప్రభుత్వం సత్కరించనున్నట్లు ప్రకటించడం అభినందనీయమన్నారు. జైలు జీవితం అనుభవించిన ఉద్యమకారుల వివరాలతో కూడిన జాబితాను ఇప్పటికే ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలకు అందజేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఇప్పటికైనా వారిని గుర్తించి ఉద్యమకారులకు ఇళ్ల స్థలం, పింఛన్, ఉచిత వైద్య సేవలు అందించాలని కోరారు. 1969 ఉద్యమ నేతల్లో ఇప్పటికే ఎంతో మంది చనిపోయారని, మిగిలిన వారిలో 45 మందితో కూడిన ఉద్యమకారుల లిస్టును సీఎంకు అందజేయనున్నట్లు తెలిపారు. అప్పటి ఉద్యమకారుల పేరుతో కొన్ని నకిలీ సంఘాలు పుట్టుకు వస్తున్నాయని అలాంటి వారి పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం 72 ఏళ్ల లోపు ఉన్నవారు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదని, 72 ఏళ్ల పైబడి ఉన్నవారిని మాత్రమే ఉద్యమకారులుగా గుర్తించాలని కోరారు.

ఎన్‌టీఆర్ జాతీయ స్మారక పురస్కారాల ప్రదానం


వివిధ రంగాల ప్రముఖులను సత్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో తారకరామారావు(ఎన్‌టీఆర్) జయంతి వేడుకలను పురస్కరించుకుని బుధవారం వివిధ రంగాల్లో సేవలు అందించిన ప్రముఖులకు ఎన్‌టీఆర్ స్మారక జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ పుస్తకాలపై సమీక్ష చేశారు. భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హై కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, టి.డి.జనార్దన్, నందమూరి మోహనకృష్ణ, పద్మశ్రీ కొనకలూరి ఇనాక్, రిటైర్డ్ ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ ఎం.నర్సింహ్మప్ప, దర్శకులు రేలంగి నర్సింగ్‌రావు, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్, కంఠంనేని రవికుమార్, డాక్టర్ జల్ది విద్యాధర్, రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, రాధాకుసుమ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి


మణియార్ పట్టిలో పర్యటిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: మణియార్ పట్టిలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అన్నారు. ఈ మేరకు బుధవారం అధికారులు, సిబ్బందితో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, లో ప్రెషర్ కారణంగా నీరు అందడం లేదని స్థానికులు ఆమె దృష్టికి తెచ్చారు. సమస్యను సత్వరమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆర్.సంతోష్, నాగరాజు, హెచ్.రవి, సందీప్, గోపి, పటేల్, శ్యామ్, ఎస్. రవి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా చెత్త డంపింగ్ కేంద్రాల తొలగింపు


కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డీఎంసీ మారుతీ దివాకర్

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో చెత్త డంపింగ్ కేంద్రాలను దశలవారీగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్ఎంసీ సర్కిల్-16 డీఎంసీ మారుతీ దివాకర్ తెలిపారు. బుధవారం అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్ చౌరస్తాలోని చెత్త డంపింగ్ కేంద్రాన్ని శాశ్వతంగా తొలగించారు. ఇక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెత్త డంపింగ్ కేంద్రం వద్ద ప్రత్యేకంగా ముగ్గులు వేసి అలంకరించారు. చెత్త వేయకుండా పరిసరాల ప్రాంతాల వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, ఎస్ఎంఏలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ కాదు.. ఎన్‌టీఆర్ స్టేడియమే..



- ఎక్కడ చూసినా చెత్తకుప్పలు
- చోద్యం చూస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు


ఎన్‌టీఆర్ స్టేడియంలో పేరుకుపోయిన చెత్త కుప్పలు

కవాడిగూడ: నగరంలో పారిశుద్ధ్య నిర్వహణకు జీహెచ్ఎంసీ రూ.కోట్లు వెచ్చిస్తున్నా... క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం కారణంగా సమస్య పరిష్కారం కావడం లేదు. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పలు కాలనీలు, బస్తీల వాసులు చెత్తా చెదారం మధ్యే జీవనం సాగించాల్సి వస్తోంది. దీంతో ప్రజలు నిత్యం రోగాల బారిన పడుతున్నారు. ఇందిరా పార్కు ధర్నా చౌక్ సమీపంలోని ఎన్‌టీఆర్ స్టేడియం చెత్త కుప్పలతో నిండిపోతుంది. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. తడిచెత్త కారణంగా దుర్వాసన వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్లపై చెత్తను ఊడ్చి తీసుకెళ్లాల్సిన సిబ్బందే ఎన్‌టీఆర్ స్టేడియంలో పారబోస్తుండటంతో డంపింగ్ యార్డ్‌ను తలపిస్తుంది.

రాత్రివేళల్లో చెత్త పడవేస్తున్నారు

ఎన్‌టీఆర్ స్టేడియంతోపాటు కవాడిగూడ డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీల్లో రాత్రి వేళల్లో యథేచ్ఛగా చికెన్ సెంటర్ల వ్యర్థాలు, కూరగాయలు, కొబ్బరిబొండాలు, ఇతర వ్యర్థాలను పారబోసి వెళ్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది పట్టించుకోవడం లేదు.

కొరవడిన పర్యవేక్షణ

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది ఎన్నికల విధుల్లో బిజీగా ఉండటంతో కొన్ని నెలలుగా ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఎన్‌టీఆర్ స్టేడియంతో పాటు కొన్ని బహిరంగ ప్రదేశాలు వ్యర్థాలతో నిండి దుర్వాసన వెదజల్లుతుంది.

వ్యాధులు ప్రబలే అవకాశం

అపరిశుభ్రత కారణంగా ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని తద్వారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై చెత్త పేరుకుపోకుండా యుద్ధప్రాతిపాదికన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే



జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఎన్‌టీఆర్ స్టేడియం డంపింగ్ యార్డ్‌లా మారింది. దీంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే జీహెచ్ఎంసీ అధికారులు చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

– కార్పొరేటర్ జి. రచనశ్రీ

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



ఎన్‌టీఆర్ స్టేడియంతో పాటు డివిజన్‌లో అనేక చోట్ల చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. వర్షాకాలం నేపథ్యంలో చెత్తతో తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త తొలగించేందుకు చర్యలు చేపట్టాలి.

–ప్రభాకర్ గంగపుత్ర

7న ప్రైడ్‌ఆఫ్ తెలంగాణ పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శిఖరం ఆర్ట్‌థియేటర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 7న ప్రైడ్‌ఆఫ్ తెలంగాణ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు సంస్థ స్థాపక కార్యదర్శి జి.కృష్ణ తెలిపారు. బుధవారం ఆయన వివేక్‌నగర్‌లో మాట్లాడుతూ విద్యా, వైద్యం, న్యాయ, సంగీత, నృత్యం, సామాజిక సేవా రంగాల్లో రాణిస్తున్న వారు పురస్కారాలకు దరాఖస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగలవారు జూన్ 4లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94945 23562 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

డీబీఎఫ్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

చిక్కడపల్లి: డీబీఎఫ్ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభను విజయవంతం చేయాలని ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అన్నారు. ఈనెల 30న సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం స్వామి వివేకానంద నగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పులికల్పన మాట్లాడుతూ మహాసభల్లో రాజ్యాంగ పరిరక్షణ , రిజర్వేషన్లు, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్య, వైద్యం, ఉపాధి, గ్రామీణ ఉపాధి, కార్మికుల చట్టం తదితర అంశాల పై చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి డాక్టర్ గోపీనాథ్, జస్టిస్ చంద్రకుమార్, గోపాల్‌రావు, ఆకునూరి మురళి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు శంకర్, బస్తీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్ డంపింగ్ యార్డ్‌లో ప్రమాదం

పారిశుద్ధ్య కార్మికుడికి తీవ్ర గాయాలు


గోతిలో పడిన బాలరాజు

కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని జీహెచ్ఎంసీ ట్యాంక్‌బండ్ చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే రాంనగర్‌కు చెందిన బాలరాజు అనే పారిశుద్ధ్య కార్మికుడు చెత్త డంపింగ్ మిషన్ వద్ద పని చేస్తుండగా ప్రమాద వశాత్తు చెత్త లారీ వెనక నుంచి ఢీకొట్టడంతో అతను వెనక ఉన్న గోతిలో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని రాంకీ సంస్థ నిర్వాహకులు వారాసిగూడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వనున్నట్లు తెలిసింది.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు


యాదగిరిని సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం ప్రతినిధులు

కాచిగూడ: ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందని అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ అన్నారు. బీడీఎల్ సంస్థలో 30 ఏళ్లపాటు పనిచేసి పదవీ విరమణ చేసిన యాదగిరి ముదిరాజ్‌ను బుధవారం ముదిరాజ్ సంఘం ప్రతినిధులు అభినందించారు. విధి నిర్వహణలో అంకిత భావంతో ప్రజలకు సేవలందించారన్నారు. ఆయన శేష జీవితం కూడా ప్రజా సేవకు అంకితం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సామా పృథ్వీరాజ్ ముదిరాజ్, వాసు ముదిరాజ్, బాలకృష్ణ ముదిరాజ్, చంద్రశేఖర్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, యాదగిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు విజితా రెడ్డి

నల్లకుంట: అంబర్‌పేట నియోజక వర్గ కాంగ్రెస్ సీనియన్ నాయకుల ఆధ్వర్యంలో రెడ్డి సంఘం గ్రేటర్ అధ్యక్షురాలు, కాంగ్రెస్ నాయకురాలు దేవిరెడ్డి విజితారెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికకాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ కార్యదర్శి అజయ్ కుమార్, ఉమ్మడి ఏపీ పీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ జీబీ శ్యామ్ రావు, టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, ఎస్. హరినాథ్ రెడ్డి తదితరులు ఆమెతో కేట్ కట్ చేయించి, శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేదలకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియన్ నాయకులు ఎస్. హరినాథ్ రెడ్డి, బి. కాంతారావు, ఎడ్ల నరేందర్ రెడ్డి, శరత్, శ్రీనివాస్ రెడ్డి, రామ్మోహన్, భూదాన్ సాగర్ రెడ్డి, విశ్వేశ్వర్ రావు, సీహెచ్. మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పుష్పయాగం


పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి పుష్పయాగం ఘనంగా జరిగిది. ఆలయ వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు, గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయుల ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, రక్షాబంధనం , అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, మహానివేధన, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పతాధివాసము, హవనము, భేరిపూజ, దేవతాహ్వానము, హవనము, బలిహరణము కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో లలితా సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలను నిర్వహించారు. గురువారం ఘటాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి స్వామి వారి శృంగార డోలోత్సవం అనంతరం వేదపండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు.

తెలంగాణ సాహితీ వైతాళికుడు సురవరం


సురవరం ప్రతాపరెడ్డికి నివాళులర్పిస్తున్న వెంకటదాసు, కళాజనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి: తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వానికి సురవరం ప్రతాపరెడ్డి విశేష సేవ చేశారని పలువురు ప్రముఖులు అన్నారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికపై గానసభ నిర్వహణలో జరుగుతున్న శతాబ్ది మహనీయులు యాదిలో భాగంగా తెలంగాణ సాహితీ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి పెద్దూరి వెంకటదాసు మాట్లాడుతూ న్యాయవాదిగా, సామాజిక వేత్తగా, సంపాదకునిగా, తెలంగాణ రైతాంగ సాయిధ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన ఉద్యమ కారునిగా ప్రతాపరెడ్డి చరిత్రను పాఠ్య పుస్తకంలో చేర్చాలని కోరారు. గాన సభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి మాట్లాడుతూ గోల్కొండ పత్రిక సంపాదకుడిగా తెలంగాణ కవులు, సాహితీవేత్తలను వెలుగులోకి తెచ్చిన సురవరం ప్రతాపరెడ్డి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా కూడా గుర్తింపు పొందారని, ఆయన జీవితం నేటి రాజకీయ వేత్తలకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ మూర్తి, భవాని, శ్రీమణి తదితరులు పాల్గొన్నారు.

1న నృత్య సంగీతంపై ప్రసంగం


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చిక్కడపల్లి: ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి 65వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న భారతీయ శాస్త్రీయ నృత్య సంగీత రీతుల ప్రసంగ పరంపరలో భాగంగా నృత్య సంగీతంపై జూన్ 1న శ్రీ త్యాగరాయ గానసభలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయ్‌కుమార్ , సమన్వయ కర్త నిష్టల సుధామాల తెలిపారు. బుధవారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరంచారు. కార్యక్రమంలో నృత్యగురువులు ఇందిరాహేమ, వి.వాణి రమణ, శ్రీలత నారపరాజు పాల్గొన్నారు.

పూడికతీత పనులు వేగవంతం చేయాలి


పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కచ్చానాలాల్లో వరద నీరు సాఫీగా వెళ్లేందుకు పూడకతీత పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. బుధవారం డివిజన్‌లో పూడికతీత పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో వరదనీరు నిలవకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు పనులను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నేతలు ఆనంద్, జ్ఞానేశ్వర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు వీల్‌చైర్, స్ట్రెచర్ విరాళం


వీల్‌చైర్ స్ట్రెచర్‌ను అందజేస్తున్న నంద కిషోర్ యాదవ్

కాచిగూడ: హర్రస్‌పెంటలోని అంబర్‌పేట హిందూ శ్మశాన వాటికకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం చైర్మన్ చిట్టబోయిన నందకిషోర్ యాదవ్ బుధవారం వీల్‌చైర్, స్ట్రెచర్‌ను విరాళంగా అందజేశారు. పేదలు, వృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం వీటిని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్మశాన వాటిక మేనేజర్ కుమార్, స్మశానవాటిక ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి


నింబోలి అడ్డలో రోడ్లపై పారుతున్న డ్రైనేజీ

కాచిగూడ: నింబోలిఅడ్డలో రోజుల తరబడి రోడ్లపై డ్రైనేజీ నీరు పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా స్పందించడం లేదన్నారు. మురుగు నీరు కారణంగా దోమలు వృద్ధి చెంది రోగాల భారిన పడుతున్నామని, దుర్వాసనను తట్టుకోలేక పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.

రైల్లో నుంచి జారిపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్: నడుస్తున్న రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. రామకృష్ణాపురం రైల్వేస్టేషన్ సమీపంలో వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతుడి వివరాలు సేకరించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటాయని నడుస్తున్న రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై కాఫీ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని సంబంధీకులు ఉంటే 8712658581 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

స్టాక్ మార్కెట్ ఐపీవోల పేరుతో రిటైర్డ్ ఉద్యోగికి భారీ టోకరా

హిమాయత్‌నగర్: స్టాక్ మార్కెట్ ఐపీవోలు సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాలని, అందులో అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన 72 ఏళ్ల ఓ రిటైర్డ్ ఉద్యోగికి ట్రేడింగ్ సంబంధించిన పిమ్‌కో గ్రూప్‌లో సభ్యుడు ఉన్నారని మెసేజ్ చేశారు. లేదని సమాధానం ఇవ్వడంతో అందులో సభ్యుడిగా చేరాలని చెప్పారు. అనంతరం బాధితుడికి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. కేటుగాళ్లు ఓరియంట్ బెల్ లిమిటెడ్ ఐపీవో షేర్లను కొనుగోలు చేయాలని చెప్పారు. షేర్లు లిస్ట్ కాబోతున్నాయని అందులో అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. వారు చెప్పిన విధంగా వాట్సాప్ గ్రూప్ ద్వారా నకిలీ ట్రేడింగ్ అకౌంట్‌లో షేర్లు కొనుగోలు చేశాడు. అనంతరం మరుసటిరోజు బాధితుడికి బ్లాక్ ట్రేడింగ్ చేయాలని సూచించారు. ఈ విధంగా వివిధ స్టాక్‌లలో పెట్టుబడులు పెట్టాలని చెబుతూ బాధితుడి నుంచి విడతల వారిగా రూ.25 లక్షలు సైబర్ కేటుగాళ్లు కాజేశారు. బాధితుడు పెట్టుబడి పెట్టిన మొత్తాన్ని విత్ డ్రా చేసుకోవాలని ప్రయత్నించగా విత్ డ్రా కాలేదు. దీంతో మోసపోయానని బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు. ప్రజలు స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అధిక లాభాలకు ఆశపడి మోసపోవద్దని, సైబర్ మోసానికి గురైన బాధితులు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేయడం, లేదా వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఏసీపీ సూచించారు.